# తలపులో మలుపు

బస్సు, ప్రయాణీకులకోసం నిరీక్షిస్తూ కూర్చుంది. చెట్టు నీడన కూలిపోబోతున్న గుడిశలోకి కాఫీకని డ్రైవరు వెళ్లాడు. కండక్టరు బస్సు రూట్లను జాతీయం చెయ్యటాన్ని గురించి లెక్చరు యిస్తున్నాడు. ఈ ప్రైవేటు బస్సులవల్లనే ప్రయాణీకులకు సౌకర్యాలు యెక్కువట. ఎక్కడ చెయ్యి చూపిస్తే అక్కడ బస్సు ఆపుతారుట. ఇంతమందే యెక్కాలని లెక్కలు చెప్పరుట. అవసరంగా వెళ్లాలని ప్రయాణీకుడు అంటే యెంతమంది బస్సులో వున్నా, ఒక్కడికి మాత్రం ఖాళీవుంటుందిట. డ్రైవరు ఒదిగి ఒదిగి తన సీట్లోనే యింకొకర్ని కూర్చోపెడతాడట. అవసరమైస్తే, ప్రయాణీకులకు చోటిచ్చి తాను ఫుట్ బోర్డుమీద నిలబడి

వేలాడుతూ వుంటాడుట కండక్టర్. ''ఇన్ని సదుపాయాలున్నా, ప్రభుత్వం వారు బస్సురూట్లను జాతీయం చేస్తుంటే దేబెమొగాల్లాగ చూస్తూ కూర్చు న్నారు. ప్రజలందరూ మీ సౌకర్యాలకోసం మీరు పోట్లాడకపోతే ఇంకె వరు పోట్లాడతారు'' అంటూ కండక్టరు చెమట్లు పోసేటట్టు చెప్పేశాడు.

'నువ్వు చెప్పినదంతా అక్షరాలా నిజమే!' అన్నారు నలుగురూను. ''మనమంతా కట్టుకడితే, ప్రభుత్వం మాత్రం యేంచేస్తుందిలే''అన్నారు. కొందరు. ''అంత దమ్ము ప్రజల్లో నిజంగా వుంటే, ప్రభుత్వంవారు ప్రజలకు వ్యతిరేకంగా యిలాంటి పని తలపెట్టనే పెట్టరు'' అన్నాడు ఓ పెద్దమనిషి.

ఇట్లా మాటలు జరుగుతూనే వున్నాయి, ఒక్కొక్కళ్లే ఒక్కొ క్కళ్ళే వచ్చి, మెల్లిగా బస్సులో కూర్చుంటున్నారు.

"కండక్టరుగారూ! యీ బస్సు యింకాయెంత సేపటికి బయలుదేరు తుందండి?'' అన్నాడు ఓ ప్రయాణీకుడు చాలా విసుగ్గా.

''మీ రెక్కంగానే అయిపోయిందేమిటి? మీ తర్వాత వచ్చిన పెద్దమనిషి ఏమనుకుంటాడు. మనం తుస్సుమని వెళ్ళిపోతే?''

''మళ్లీ యింకో బస్సువస్తుంది కాదుటండీ!...''

''మా ఒక్క బస్సే అని చెప్పానా ఏమిటి! మీరు అట్లా మాట్లా డతారు, తెలిసిన వారు కూడా...''

''మళ్ళీ మేం లంక వెళ్ళాలండీ, ఇక్కడే పొద్దూకిపోతే మా గతేం కాను చెప్పండి.''

''అయితే ప్రయాణీకుల్ని కష్టపెట్టాలని ఆపామంటారా యేమిటి? మీరనేది నాకు అర్థంకాక అడుగుతాను...'' కండక్టరు దబాయిస్తున్నాడు.

"ఈ బస్సుకు టైములేవీ వుండవేమిటండీ!'' కోపాన్ని అణచుకుని తీవ్రంగా అడిగాడు ఒకాయన.

"టైము లేకపోవటమేటండి? టైము ప్రకారంపోకపోతే మా ఇన్ స్పెక్టర్లు మా పీక నొక్కేస్తారు...మా మీద యెంతమంది చెకింగు! మీకేం తెలుస్తుంది మా బాధ...''

''నిన్న మూడుగంటలకే బస్సు వెళ్ళిపోయింది కాదండీ, ఇవ్వాళ మూడున్నరయినా యిక్కడే వుందే!...''

''నేనొక్కణ్ణి కండక్టర్ని; మీ నలుగురూ తలొక ప్రశ్నవేస్తే. నేనేం సమధానం చెపుతాను చెప్పండి..."

''మీ సమాధానాలతో మాకేం పనండి. బస్సును పోనీయండి—''
ఇంకో ప్రయాణీకుడన్నాడు.

''డ్రైవరుగారూ ఏమిటి యింకా కాఫీ తాగటం కాలేదా! ఒమూల ప్యాసెంజర్లు తొందర పెడ్తున్నారు...''రండి ఆ! ఎక్కడికి! మీరెక్కడి కండి! త్వరగా, త్వరగా తియ్యండి డబ్బులు బస్సు యేమో తొందరగా పోవాలంటారు. డబ్బులు తియ్యటమంటే యెంతో నిదానం ''

''నువ్వు ఉరుకులు పరుగులు తీస్తున్నావని, వయస్సు వాళ్ళతో సమానంగా నేనేం పరుగెత్తుతానయ్యా!...''

''అబ్బ! నిన్నుగాదయ్యా తాతా నీదోగోల...''

డ్రైవరువచ్చి కూర్చున్నాడు. హారన్ మోగిస్తున్నాడు.

''ఎక్కండయ్యా, ఎక్కండి. ఎంతసేపూ మీ కోసమని మేము ఆపుతేనేమో ప్యాసెంజర్లు మమల్ని తిడుతూండె! పోనిస్తేనేమో మీరు తిట్టుతారయ్యె. రెండు విధాల్లా మాకే నష్టం.''

డ్రైవరు రెండడుగులు పోనిచ్చాడో లేదో "హోల్డాన్" అని అదిరి పోయేటట్లు అరిచాడొకాయన. చప్పున డ్రైవరు ఆపేశాడు.

"కాస్త ముందుకు సర్దుకోండయ్యా. మీరట్లాగే నుంచుటా రేమిటి!.."

"ఇంకా యెక్కడికి సద్దుకోమంటావయ్యా! ఓ మూల చూస్తూనే వుంటివిగా! ఆడకూతురు అక్కడుండె..."

"ఎట్లాగోట్లా సద్దుకోండయ్యా! బస్సులో ఎక్కినవాడివి పుట్ బోర్డు మీద నిలబడితే ఎట్లాగయ్యా! లోపలికి పద, రైట్" కండక్టరు ఇనపచువ్వ పట్టుకుని వేలాడ్తున్నాడు. కుదుపుతో ప్రయాణికులంతా, భూకంపం వచ్చి నప్పుడు తూలినట్లు వూగిపోయారు. ఒకాయన మొహం కిటికి చువ్వకు గుద్దుకుంది. ఒకమ్మాయి చేతికి రైతు చేతిలో కర్రకొట్టుకుని గాజులు చిట్లినాయి. ఇంకొ కాయన చెప్పు కాలు వెళ్లి, ముందున్న కుర్రాడి పాదాన్ని పచ్చడి చేసింది. బస్సు ఓ నిమిషంసేపు గిర్రున స్పీడులో పరుగెత్తి ఎక్కడో, 'హోల్డాన్' అనేటప్పటికి చప్పున ఆగి పోయింది. ఆగినట్టే ఆగింది. ఎవరో ఎక్కినట్టున్నారు. కండక్టరు 'రైట్' అనేశాడు. మళ్ళా విసురున పరుగెత్తింది.

ఎక్కేవాళ్లు ఎక్కుతూనే వున్నారు. బస్సంతా కిటకిటలాడి పోతోంది. ఆ ఇరుకులోనే దారి చేసుకుంటూ కండక్టరు డబ్బు వసూలు చేసుకుంటున్నాడు. రాజబాట మీద సూటిగా పోతున్నదల్లా ఒక్కక్షణంలో మలుపు తిరిగి గళ్లపడ్డ రోడ్డుమీద గంతులు వేసుకుంటూ బస్సు దూరంగా ఆగింది. ఒకతను దిగి రెండంగల్లో పెంకుటింట్లో దూరాడు. ఇంట్లో వాళ్లు అప్పుడే మూటలు కడుతున్నారు. సామాన్లు సర్దుకుంటున్నారు.

"త్వరగా! త్వరగా!'' అరుస్తూంటేనే పదిహేను నిమిషాలు దాటి పోయింది. డ్రైవరుగారి భార్య తాలూకు బంధువులు వచ్చి ఫ్రంటు సీటులో కూర్చున్నారు. 'రైట్' అని అరిచాడు కండక్టరు.

''ఏమిటయ్యా, యిక్కడికి తీసుకువచ్చి యింత సేపు ఆపావు'' అని అనటానికి ఒక్కడికీ సాహసం లేదు. పస్తాయించి పస్తాయించి ఒకాయన కస్సుమన్నాడు.

''అంత యిష్టంలేకపోతే బస్సు దిగిపొండి'' అన్నాడు కండక్టరు.

''టిక్కెట్లు తీసుకున్న తర్వాత ఎట్లా దిగుతామయ్యా''దబాయించా డొకతను.

"ఈ కాస్తకీ యింత తొందరపడితే ఎలాగండి? ఇందులో మీరు పెద్దవారు. శాంతంగా వుండాలసిన వాళ్లు'' అన్నాడు కండక్టరు కిలకిల మంటూ.

బస్సులో సగంమంది ఆ నవ్వుకు కోరస్ పాడారు. అది చేతుల్లో ప్రాణాలు పెట్టుకుని, బిక్కు బిక్కుమంటూ వుండిపోయారు బస్సులో జనమంతా.

బరబరా పోతుంటే రోడ్డుమీద హోల్డాన్, హోల్డాన్ అంటూనే వున్నారు. కండక్టరు ఆపిస్తూనే వున్నాడు.

''ఇంకా యెక్కడ ఎక్కిస్తావయ్యా, మా నెత్తిమీద.'' నాలుగు కంఠాలు ఒక్క స్వరంతో లేచినాయి.

కండక్టరు రైట్ అన్నాడు.

"ప్యాసెంజర్లు వద్దంటుంటే ఎక్కడ ఎక్కిస్తాంలెండి. డ్రైవరు గారూ, పోనీండి. లంక రోడ్డుదాక ఎక్కడా ఆపకండి "

కండక్టరు అధారిటీలో బస్సు సాగిపోతోంది. రైట్ టైమ్‌కు పోవా లని డ్రైవరు ఆదుర్దా పడుతున్నాడు. కండక్టరు ఆవేశపడుతున్నాడు. బస్సు స్పీడులో పోతోంది. ఇక్కడ ఆపండయ్యా అనే శబ్దం కండక్టరు చెవిన పడినా కూడా వినపడనట్టు నటించాడు. ప్రయాణికుడు గొంతెత్తి అరిచాడు. కండక్టరు హోల్డాన్ అంటూ, దిగవయ్యా దిగు ఎంత సేపు యింకా అంటూ గదమాయిస్తున్నాడు. ప్రయాణికుడు తత్తరపాటుగా వస్తూ, కుడికాలు క్రింద పెట్టాడో లేదో-రైట్ అన్నాడు కండక్టరు. అమాంతం బస్సు ఒక్క వూపులో ముందుకు పోవటం, ఆ ప్రయాణికుడు బోర్లపడటం జరిగి పోయాయి. గేటు దగ్గరగా వున్న ప్రయాణికులు పక్కున నవ్వారు. ప్రయాణికులు ఒకరికొకరు చూపించే సానుభూతి చూసి కండక్టరూ నవ్వాడు. బస్సు వంకర్లు వంకర్లు తిరిగి, మెలికలు తిరిగిన రోడ్డును సూటిగా చేసుకుంటూ సాగిపోతోంది.

"డ్రైవరుగారూ, పోనీండి'' అని కేక పెడుతున్నాడు ఓ మూల కండక్టరు. డ్రైవరు స్పీడు యింకా పెంచుతున్నాడు. తీవ్రంగా పోతోంది రోడ్డు మీద. అటూ యిటూ నిర్లక్ష్యంగా తిరుగుతున్న కోళ్ళను, బాతు లను, డ్రైవరు ప్రాణులకింద లెక్కకట్టకుండానే పోతున్నాడు. పశువులు అడ్డం వచ్చినప్పుడు మాత్రం, కారుకు యెక్కడ దెబ్బ తగిలిపోతుందో అని కాస్తంత జాగ్రత్తగా పోనిస్తున్నాడు. ఇంకా వూళ్లోకి ఫర్లాంగు దూరం వుందనగానే ''ఇక్కడ దిగేవాళ్ళెవరో దిగండి'' అంటూ కండక్టరు అరిచాడు. ''ఇక్కడ మధ్యలో యెట్లాగయ్యా'' అన్నాడు ఒకాయన.

"ఊళ్ళో ఆగదండి బస్సు. ఇక్కడే దిగాలి..." కండక్టరు గట్టిగా అనేశాడు.

డ్రైవరు వంతపాట పాడుతున్నాడు. "ఇదంతా నడిచి పోవదు టండీ!" అన్నాడు ఒకాయన మొండికేసినట్లు.

"నాలుగు అడుగుల్లో వెళ్ళిపోతారు. ఊరు అదేకాదుటండీ. ఆడ వాళ్ళు, పిల్లలు దిగుతున్నారు కాని, మీరు దిగటానికి పెద్దయిది చేస్తా రేమిటండి..." అన్నాడు కండక్టరు.

అభిమానం దెబ్బతిన్నట్టు బాధపడి, లోలోపల తిట్టుకుంటూ దిగి వెళ్ళిపోయాడాయన.

బస్సు పూళ్ళోకి వచ్చి ఆగింది. దిగేజనమే కనిపించక పోయె! ఎక్కేవాళ్ల మాత్రం తన్నుకుంటున్నారు, తను ముందరెక్కాలంటే తను ముందరెక్కాలని.

గబగబ అయిదారుగుర్ని ఎక్కించాడు. ఖాళీ లేదండీ అంటూ బిగ్గరగా అరిచాడు కండక్టరు, ప్రక్కన పోలీసు రూటు ఇన్‌స్పెక్టరు వినేలాగున. మెల్లిగా ఓ ప్రయాణికున్ని పిలిచి, 'మలుపుకాడ అంకమ్మ గుడిదగ్గర ఆపుతాను. మీరంతా అక్కడికి రండి' అన్నాడు.

వీళ్ళంతా కాలినడకన ప్రయాణమై పోతున్నారు. బస్సు తుర్రున వచ్చేసి, గుడిదగ్గర ఆగింది. బస్సునిండా జనాన్ని తొక్కేశాడు. ఊపిరి ఆడటంలేదు. అసలే వుక్కపోతోంది. అందులో రద్దీ యెక్కువ, ముక్కులు మూసుకుని నిలబడ్డారు.

కండక్టరు డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఒక్కొక్కళ్ళే వరసగా దక్షిణలు చెల్లిస్తున్నారు. బస్సు వేగంగా పోతోంది. ఆ స్పీడుకు ప్రయా

ణీకులు దద్దరిల్లి పోతున్నారు. ఏమి అనటానికీ తోచటంలేదు. పోయి పోయి, అమాంతం ఒక చెట్టుకు గుద్దుకుంది బస్సు. ప్రయాణీకులు చిందర వందరగా క్రింద పడ్డారు. మోకాళ్లు గీసుకుపోయినాయి. మొహాలు చెక్కుకు పోయినాయి. మోచేతులు సడలినాయి. తలలు తిరిగిపోయినాయి. ఒక పట్టాన తెప్పరిల్లి లేచారు. ప్రక్క పంటకాలువ దగ్గరకు వెళ్ళి, మళ్లా తమ రూపుల్ని సరిదిద్దుకుంటున్నారు. ఇంజనుకేమన్నా దెబ్బతగిలిందేమో అని డ్రైవరు, కండక్టరు ఆదుర్దాగా చూస్తున్నారు. బస్సు లైట్లు పగిలి నాయి. రేకు వంకరపోయింది. అంతకంటె ప్రమాదంయేమీ లేదని తృప్తి పడ్డారు. ఒక్కొక్కళ్ళే కుంటు కుంటూ, నడుములు పట్టుకుంటూ, ఆపసోపాలు పడుతూ, బస్సు దగ్గరకు వస్తున్నారు. వచ్చి ఎవర్ని యేమంటారు! మెదలకుండా యెక్కి కూర్చున్నారు. బస్సు ప్రమాదాలను గురించి తాము విన్నవి, పేపర్లలో చూసినవి ఒక్కొక్కరే ఏకరువు పెడుతున్నారు.

అడంగుకు చేరేటప్పటికి, రెండు గంటలు లేటయింది. రైలుకై బయలు దేరిన వారికి రైలు తప్పింది. పెళ్లికై బయలుదేరిన వాళ్ళకు లగ్నం తప్పింది. కొంతమందికి మతీ తప్పింది. 'ఇంకా నయం, బ్రతికి బైట పడ్డాం. ఆ బస్సేకనక తల క్రిందులవుతే మన ప్రాణాలేపోయేవి. అవైనా మనకు దక్కినాయి. యింక యేవి తప్పితేమట్టుకు యేం?' అను కున్నారు. బస్సులు జాతీయం చెయ్యటంవల్ల కలిగిన అనర్థాలను గురించి కండక్టరు యిచ్చిన వుపన్యాసం ఎవ్వరికీ జ్ఞాపకం రాలేదు.

(ధంకా)

---